
ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
22-07-2024
సోమవారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 324 | పేజీలు : 8 | వెల : 4
JB
జయభేరి




# కనుల పండువగా లష్కర్ బోనాలు

## మొక్కులు చెల్లించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి

అమ్మలగన్నమ్మ.. భక్తుల కొంగుబంగారం.. సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి బోనాలు కొనసాగుతున్నాయి. నగరంతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడుతోంది. జంటనగరాల ప్రజలకు ఇవాళ ఫెస్టివల్ సండే. సికింద్రబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో బోనాల సందడి కనిపిస్తోంది. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్నారు. తెలంగాణ సీఎం రేవంత్, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయానికి వచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. సీఎం రేవంత్, అమ్మవారిని దర్శించుకుని, పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మలగన్నమ్మ.. భక్తుల కొంగుబంగారం.. సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి బోనాలు కొనసాగుతున్నాయి. నగరంతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడుతోంది. తెల్లవారుజామునుంచే అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రంత్రి కిషన్‌రెడ్డి సహా పలువురు మంత్రులు, ప్రముఖులు ఉజ్జయిని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

# పిటిషన్ ఇచ్చి 7 నెలలు కావొస్తుంది

నేను ఆ రోజే రేవంతన్నకు చెప్పా..!

మాజీ డీఎస్పీ నళిని ఆవేదన



నళిని... తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఈ పేరు చుట్టూ తెగ చర్చ జరిగింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో.. తన డీఎస్పీ పదవికి రాజీనామా చేసి వార్తల్లోకి ఎక్కారు ఈమె. ఆ తర్వాత రాష్ట్ర సాధన కోసం క్రియాశీలకంగా పోరాడారు. ఉద్యమ వాణిని వినిపించేందుకు పరకాల బైపోల్ బరిలోనూ నిలబడ్డారు. ఉద్యమ సమయంలో ఎంతో పేరు సంపాదించికున్న నళిని... ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత ఆమె ప్రస్తావన పెద్దగా లేకుండా పోయింది.

గత పదేళ్లలో కూడా పెద్దగా కనిపించిన దాఖలు లేవు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి పోలీస్ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నళిని ప్రస్తావన తీసుకొచ్చారు. తిరిగి డీఎస్సీ ఉద్యోగం ఎందుకు ఇవ్వకూడదనే అంశంపై ఆరా తీశారు. పోలీసు ఉద్యోగం కుదరకపోతే... అదే స్థాయిలో ఉండే మంచి ఉద్యోగాన్ని ఇవ్వాలని పోలీసులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ విషయంలో నళినితో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇవ్వటంతో.. మళ్లీ మాజీ డీఎస్పీ నళిని ఉద్యోగ అంశం తెరపైకి వచ్చింది. ఇదే సమయంలో ఆమె స్వయంగా వెళ్లి డిసెంబర్ 30వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసింది. అధ్యాత్మిక ప్రచారానికి సాకారం (వేద విద్యా కేంద్రం) అందించటంతో పాటు

...మిగతాది 2 లో

## తక్షణం సరిదిద్దకపోతే

# సంక్షోభమే..!

- తిరోగమనంలో ఆంధ్రా ఆదాయం
- భారీగా పడిపోయిన సేల్స్ టాక్స్ ఆదాయం
- ప్రభుత్వంతో వ్యాపారమంటేనే భయపడే పరిస్థితులు
- అప్పులు చేయక తప్పని పరిస్థితి

ఆంధ్రప్రదేశ్ ఐదేళ్లలో అప్పుల కుప్పగా మారిందనే విమర్శలు, ఆరోపణల మాటెలా ఉన్నా ఆదాయం మాత్రం గణనీయంగా పడిపోయింది. ఆదాయాన్ని పట్టాలెక్కించే ప్రయత్నాలు చేయకపోతే, అభివృద్ధి మాటలా ఉంచితే అప్పులు పుట్టడం కూడా గగనం అయిపోవచ్చు.




# కోతకు గురవుతున్న గోదావరి కరకట్ట




- కోతకు గురవుతున్న గోదావరి కరకట్ట
- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు
- లోతట్టు ప్రాంతాల్లో మంత్రి సీతక్క పర్యటన

గోదావరిలో వరద ప్రవాహం పెరగడంతో జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో వర్షా ల తీవ్రత ఎక్కువగా ఉండగా, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కర్ ఘాట్ సమీపంలో గోదావరి కరకట్టకు ప్రమాదం పొంచి ఉంది.



# ఎవరు ఈ కమలా హారిస్?


- భారత్‌తో కమలా హారిస్‌కి ఉన్న కనెక్షన్ ఏంటి?
- అమెరికా తొలి అధ్యక్షురాలు అవ్వగలరా?
- భారత సంతత మహిళ- చరిత్ర సృష్టించగలరా?

**ప్రస్తుత అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అధ్యక్ష రేసులో డెమొక్రటిక్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. కమలా హారిస్‌కి భారత్‌కు ఉన్న కనెక్షన్ ఏంటి? ఇక్కడ తెలుసుకోండి..**

2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి తప్పుకుంటున్నట్టు అధికారికంగా ప్రకటించారు ప్రస్తుత ప్రెసిడెంట్ జో బైడెన్. ఈ నేపథ్యంలో ఇప్పుడు అగ్రరాజ్య రాజకీయాల ఫోకస్ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌పై పడింది. నవంబర్‌లో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ తరఫున అభ్యర్థింగా కమలా హారిస్‌కు మద్దతిచ్చారు జో బైడెన్. ఈ నేపథ్యంలో అసలు ఎవరు ఈ కమలా హారిస్? భారత్‌తో ఆమెకు ఉన్న కనెక్షన్ ఏంటి?

కమలా దేవి హారిస్ కాలిఫోర్నియాలో తమిళ జీవశాస్త్రవేత్త శ్యామా గోపాలన్, జమైకాఅమెరికన్ తండ్రి ప్రొఫెసర్ డోనాల్డ్ జె హారిస్‌కు జన్మించారు. కమలా హారిస్ ఒక భారత సంతతి మహిళగా

...మిగతాది 2 లో



# బడ్జెట్‌లో ఎన్‌పిఎస్ ఆయుష్మాన్‌పై భారీ ప్రకటనలు

రేపు ప్రవేశ పెట్టే సాధారణ బడ్జెట్‌లో కొత్త పెన్షన్ సిస్టమ్, ఆయుష్మాన్ భారత్ వంటి సామాజిక భద్రత సంబంధిత పథకాలకు సంబంధించి కొన్ని ప్రకటనలు ఉండవచ్చు. అయితే, ఆదాయపు పన్ను విషయంలో కాస్త ఊరట లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడం, మౌలిక సదుపాయాలపై దృష్టి సారించడం, గ్రామీణ, వ్యవసాయ కేటాయింపుల పెంపు, సూక్ష్మ, చిన్న పరిశ్రమలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024, 25 సంవత్సరానికి గాను వరుసగా ఏడవ సారి బడ్జెట్‌ను, నరేంద్ర మోడీ నేతృత్వంలోని NDA ప్రభుత్వం మూడవ టర్మ్ మొదటి బడ్జెట్‌ను మంగళవారం, జూలై 23న లోక్‌సభలో సమర్పించనున్నారు. ప్రఖ్యాత ఆర్థికవేత్త, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్ఐపిఎఫ్‌పి) ప్రొఫెసర్ ఎన్ఆర్ భానుమూర్తిని బడ్జెట్‌లో సామాజిక భద్రతా పథకాలపై అంచనాల గురించి అడిగినప్పుడు ఎన్‌పిఎస్, ఆయుష్మాన్ భారత్‌పై కొన్ని ప్రకటనలు ఆశిస్తున్నట్లు చెప్పారు. ఎన్‌పీఎస్ (న్యూ పెన్షన్ సిస్టమ్)కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఆయుష్మాన్ భారత్ గురించి ప్రధాని కొన్ని విషయాలు చెప్పారు. లోక్‌సభ ఎన్నికల కోసం భారతీయ జనతా పార్టీ మేనిఫెస్టోను విడుదల చేస్తూ, 70 ఏళ్లు పైబడిన పౌరులందరికీ 5 లక్షల రూపాయల వరకు ఉచిత చికిత్స కోసం ఆయుష్మాన్ యోజన పరిధిలోకి తీసుకువస్తామని ప్రధాని మోడీ చెప్పారు. మెరుగైన జీవితం, ఉపాధి కల్పించడంపై పార్టీ దృష్టి సారిస్తుందని ఆయన చెప్పారు. కోవిడ్ మహమ్మారి తర్వాత ఆర్థిక వ్యూహంలో సామాజిక భద్రతా పథకాలు ముఖ్యమైనవి. అయితే, ఆరోగ్య రంగంలో బీమా పథకాలు ఈ వ్యవస్థను మరింత ఖరీదైనవిగా చేస్తాయి.




✍ **జయభేరి, కర్నూలు :**

కర్నూలు జిల్లాలో టమోటా రేట్లు భారీగా పెరుగుతుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులలో కిలో టమోటా 30 రూపాయలు నుండి 80 రూపాయలకు పెరగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు టమోటా పంటలు దెబ్బతినడం, దిగుబడులు తగ్గిపోవడంతో టమోటా రేట్లు భారీగా పెరుగుతున్నాయి. 30 రూపాయలు ఉన్న కిలో టమోటా రెండు రోజులలో 80 రూపాయలకు పెరిగింది. మరో రెండు, మూడు రోజుల్లో 100 రూపాయలకి చేరే అవకాశం ఉందంటున్నారు మర్కెట్ యాజమాన్యం. గత సంవత్సరం ఇదే ఖరీఫ్ సీజన్లో కిలో టమోటా 200 రూపాయలు పెరిగి రికార్డు సృష్టించిందని గుర్తు చేస్తున్నారు. గతంలో టమోటా పంటకు మంచి రేట్లు ఉన్నాయని రైతులు ఎక్కువ టమోటా పంటను సాగుచేశారు. ఖరీఫ్ సీజన్లో కిలో టమోటా 200 రూపాయల నుండి రెండు రూపాయలు పడిపోయి భారీ స్థాయిలో నష్టపోయారు రైతులు. అయితే ఈ టమోటా పంటను తక్కువ స్థాయిలో సాగు చేయడం.. వేసిన పంట వర్షాల కారణంగా పూర్తి స్థాయిలో దెబ్బతినడంతో టమోటా రేట్లు భారీగా పెరుగుతాయని అంటున్నారు. మరో వారం రోజులు వర్షాలు కురిస్తే టమోటా పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతినే అవకాశం ఉందంటున్నారు రైతులు. తద్వారా రేట్లు భారీగా పెరిగే అవకాశం ఉంది అంటున్నారు.



# ఆర్ఎస్ఎస్ కు వెళ్లే ఉద్యోగులపై నిషేధం ఎత్తివేత

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) కార్యకలాపాలన్నింటిలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనడంపై విధించిన నిషేధాన్ని ఎత్తివేస్తూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ ఉత్తర్వులు జారీ చేసింది. గత కేంద్ర ప్రభుత్వాలు 1966, 1970, 1980 ఉత్తర్వులను సవరించాయి. ఇందులో కొన్ని ఇతర సంస్థలతో పాటు ఆర్ఎస్ఎస్ శాఖలు, ఇతర కార్యకలాపాలలో పాల్గొన్నందుకు ప్రభుత్వ ఉద్యోగులపై కఠినమైన శిక్షార్హత నిబంధనలు విధించబడ్డాయి. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రభుత్వ ఉద్యోగులను ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలకు హాజరుకాకుండా ఎప్పటికప్పుడు నిషేధించాయి. ఈ కారణంగా చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత పెన్షన్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకలాపాల్లో పాల్గొనకుండా తప్పించుకుంటున్నారు. అయితే, మధ్యప్రదేశ్‌తో సహా పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఉత్తర్వులను రద్దు చేశాయి. అయితే దీని తర్వాత కూడా ఇది కేంద్ర ప్రభుత్వ స్థాయిలో చట్టబద్ధంగా కొనసాగింది. ఈ విషయమై ఇండోర్ కోర్టులో కేసు నడుస్తుండగా.. దీనిపై కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కూడా కోర్టు కోరింది.

మొదటిపేజీ తరువాయి

## తక్షణం సరిదిద్దకపోతే సంక్షోభమే..!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఖజానాకు వచ్చే ఆదాయం గత కొన్నేళ్ళుగా తగ్గిపోతోంది. 201419 మధ్య అంతంత మాత్రంగా ఉన్న ఆదాయం ఆ తర్వాత గణనీయంగా పడిపోయింది. ఇందులో విధానపరమైన లోపాలతో పాటు పన్ను ఎగవేతలు యథేచ్ఛగా సాగడమే దీనికి ప్రధాన కారణం. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత ప్రజలు చెల్లించే పన్నులు, ప్రభుత్వానికి జమ చేసే పన్నుల్లో వ్యత్యాసం పెరిగిపోయింది. కొన్నేళ్ళ క్రితం ఓ ఉద్యోగ సంఘంతో ప్రభుత్వానికి ఘర్షణ వైఖరి ఏర్పడటానికి కారణం కూడా ఇదేననే ప్రచారం ఉంది. పన్నుల వసూళ్లను నేరుగా పర్యవేక్షించే శాఖల్లో కొందరి చేతివాటంతో ఖజానాకు రావాల్సిన ఆదాయానికి భారీగా గండిపడుతోందనే ఆరోపణలు ఉన్నాయి. జీఎస్టీ వసూళ్లలో ప్రభుత్వానికి పన్ను చెల్లింపు దారులకు మధ్య వ్యాపారులు మాత్రమే ఉంటారు. కొనుగోలు దారుడు చెల్లించే పన్ను ప్రభుత్వానికి సక్రమంగా చేరుతుందా లేదో పర్యవేక్షించే యంత్రాంగం మాత్రం గాడి తప్పింది. ఇలా కొన్ని వందల కోట్ల రుపాయలు దారి మళ్లాయనే ఆరోపణలపై పోలీస్ కేసులు కూడా నమోదయ్యాయి. వీటి విచారణ ఎటూ తేలలేదు. జీఎస్టీ వసూళ్లతో పాటు ఏపీలో సేల్స్ టాక్స్ ద్వారా వచ్చే ఆదాయానికి కూడా భారీగా గండి పడింది. పెట్రోల్, డీసెల్, గ్యాస్ అమ్మకాలపై వచ్చే ఆదాయంలో గత ఐదేళ్లలో దాదాపు రూ.3500కోట్ల రుపాయలకు గండిపడింది. దీనికి ప్రధాన కారణం ఏపీతో పోలిస్తే పొరుగు రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తక్కువగా ఉండటమే ప్రధాన కారణం.

2018, 19లో ఏపీలో సేల్స్ టాక్స్ ఆదాయం రూ.22వేల కోట్ల రుపాయలుగా ఉంటే 202324కు అది రూ.18,500కోట్లకు పడిపోయింది. ఐదేళ్లలో దాదాపు రూ.3500కోట్ల ఆదాయాన్ని ఏపీ కోల్పోయింది. ఇలా సేల్స్ టాక్స్ ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం మొత్తం కర్ణాటక, తెలంగాణ, ఒడిశా వంటి పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయింది. ఆ రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో ఇంధన సుంకాలు అధికంగా ఉండటంతో ఏపీలో అమ్మకాలు పడిపోయాయి.

ఏపీలో ఐదేళ్లలో సేల్స్ టాక్స్ రూపంలో ఐదేళ్లలో రూ.3500కోట్ల రుపాయల ఆదాయాన్ని కోల్పోతే పొరుగున ఉన్న తెలంగాణలో 201819లో 19వేల కోట్ల నుంచి 202324నాటికి రూ.29వేల కోట్ల రుపాయలకు ఆదాయాన్ని పెంచుకోగలిగింది. సేల్స్ టాక్స్‌తో పాటు రిజిస్ట్రేషన్ ఆదాయం కూడా ఐదేళ్లలో గణనీయంగా పడిపోయినట్టు ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదాయం పడిపోవడానికి విధానపరమైన లోపాలే ప్రధాన కారణంగా కనిపిస్తాయి. ప్రభుత్వంతో వ్యాపారానికి మల్టీ నేషనల్ కంపెనీలు సుముఖత చూపడం లేదు. ప్రభుత్వంతో వ్యాపార ఒప్పందాలు చేసుకోడానికి వెండర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఏ మాత్రం ఆసక్తి చూపడం లేదు.

కాంట్రాక్టులు దక్కిన నాటి నుంచి బిల్లులు చెల్లించే సమయానికి లాభాల మాట అటుంచితే వడ్డీలు పెరిగిపోతున్నాయనే ఆందోళన ఆ వర్గాల్లో ఉంది. ఓ వైపు పన్ను వసూళ్లలో ఉద్యోగుల నిర్లక్ష్యం, చేతివాటం, మరోవైపు ప్రభుత్వంతో వ్యాపారం లేకపోవడంతో ఖజానాకు గండిపడుతోంది.

సంక్షేమ పథకాలను అమలు చేయడం, ప్రభుత్వ కార్యక్రమాలను గాడిన పెట్టడం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలంటే కనీసం మొదటి రెండేళ్లు పూర్తిగా అప్పుల పై నడవక తప్పని పరిస్థితులు ఏపీలో ఉన్నాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణ పనులు ప్రారంభించాలంటే 2019నాటికి కాంట్రాక్టర్లకు దాదాపు రూ.9వేల కోట్ల రుపాయల బిల్లులు చెల్లించాల్సి ఉంది. వాటిలో కనీసం సగమైనా చెల్లిస్తే తప్ప ఆ పనులు తిరిగి ప్రారంభించే పరిస్థితులు లేవు.

2019, 20 ఆర్థిక సంవత్సరంలో విద్యార్థినులకు ఉచితంగా అందించే శానిటరీ నాప్‌కిన్స్ సప్లై చేసిన బహుళజాతి కంపెనీకి రూ.2.70కోట్ల రుపాయలు ఐదేళ్లుగా చెల్లించలేదు. దీంతో ఆ కంపెనీ ఏపీ ప్రభుత్వంతో ఎలాంటి వ్యాపార లావాదేవీలు పెట్టుకోవద్దని డిస్ట్రిబ్యూటర్లపై ఆంక్షలు విధించింది. ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రాష్ట్రాన్ని గాడిన పడాలంటే దానికి ప్రభుత్వం చాలా తీవ్రంగా శ్రమించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అదే సమయంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు, పెట్టుబడులకు ఖచ్చితమైన భరోసా, పరిశ్రమలకు సురక్షితమైన వాతావరణం, ఆంధ్రప్రదేశ్‌లో స్థిరమైన రాజకీయ వాతావరణం కూడా అత్యవసరంగా కనిపిస్తోంది. రాజకీయాలతో పాటు శాంతిభద్రతలు కూడా రాష్ట్రాన్ని గాడిన పెడితేనే ఏపీ అభివృద్ధి బాటలో నడవగలుగుతుంది.

## కోతకు గురవుతున్న గోదావరి కరకట్ట

బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా జోరు వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండగా, ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం రామన్నగూడెం పుష్కర్ ఘాట్ సమీపంలో గోదావరి కరకట్టకు ప్రమాదం పొంచి ఉంది. వర్షాల నేపథ్యంలో గోదావరిలో నీటి ప్రవాహం పెరగగా, రామన్నగూడెం వద్ద కరకట్ట కోతకు గురవుతోంది. దీంతో ఏటూరు నాగారం, మంగపేట మండలాల్లోని గోదావరి తీర ప్రాంత గ్రామాల్లో భయాందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఏటూరు నాగారం మండలంలోని బెస్తవాడ, ఎస్సీ కాలనీ, రామన్నగూడెం, కొత్తూరు, బుట్టాయిగూడెం; మంగపేట మండలంలోని పోదూరు, అక్కినపల్లి, కమలాపూర్, వాడగూడెం, రమణక్కపేట, కత్తిగూడెం, గుడ్డేలుగుల పల్లి, మంగపేట, బోర్ నర్సాపూర్ గ్రామాలను తరచూ వరదలు వణికిస్తుండగా, కరకట్ట కోతకు గురవుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ములుగు జిల్లాలోని గోదావరి తీర ప్రాంతంలో కరకట్ట నిర్మాణం, మరమ్మతు పనులకు గతంలోనే ప్రభుత్వం దాదాపు రూ.వంద కోట్లకుపైగా నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు రామన్నగూడెం వద్ద జియో ట్యూబ్స్ తరహాలో నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు రచించారు.

కాగా ఇటీవల వరదల నేపథ్యంలో పనులు నిలిచిపోగా, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో ములుగు జిల్లా రామన్నగూడెం వద్ద కరకట్ట కొద్దికొద్దిగా కోతకు గురవుతోంది. దీంతో ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజల్లో భయాందోళన వ్యక్తమవుతోంది. స్థానికులు సమస్యను ఇరిగేషన్ ఆఫీసర్ల దృష్టికి తీసుకెళ్లడంతో ఆదివారం యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు.

కరకట్ట కోతకు గురవకుండా మరమ్మతు పనులు చేయిస్తున్నారు. ఇప్పటికే గోదావరిలో నీటి ప్రవాహం క్రమక్రమంగా పెరుగుతుండగా, మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ఆఫీసర్లు అలర్ట్ అయ్యారు. ఈ మేరకు లోతట్టు గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ములుగు జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ఆదివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. జాకారం, గట్టమ్మ ఆలయం మధ్యలో జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. వర్షంలోనే లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ఆఫీసర్లకు తగిన ఆదేశాలు ఇచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జాతీయ రహదారిపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల రవాణా సౌకర్యాలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ములుగు జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయడంతో ప్రజలు అవసరం ఉంటే తప్ప బయటకు ఎవ్వరూ రావద్దని సూచించారు. ముఖ్యంగా వాగులు, వంకలు పొంగి పొర్లుతున్న నేపథ్యంలో చేపల వేటకు వెళ్లకూడదన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్ష ప్రాంతాలకు తరలించే విధంగా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, జిల్లా అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

# ఘనంగా ప్రారంభమైన లష్కర్ బోనాలు

▸▸ తొలిబోనం సమర్పించిన మంత్రి పొన్నం

జయభేరి, హైదరాబాద్ :

అమ్మలగన్నమ్మ.. భక్తుల కొంగుబంగారం... ఉజ్జయిని మహంకాళి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. లష్కర్ బోనాలు... భాగ్యనగరానికి కొత్త శోభను తీసుకొచ్చాయి. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. తెల్లవారు జామునుంచి లష్కర్ బోనాలు ప్రారంభమయ్యాయి. తలంటు స్నానం చేసి. వ్రతం ఆచరించి, భక్తి శ్రద్ధలతో బోనం సమర్పించి మొక్కు తీర్చుకుంటున్నారు భక్తులు. . మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలతో పాటు తొలి బోనం సమర్పించారు. బోనాలతో లష్కర్ శోభాయమానంగా వెలుగొందుతోంది. సికింద్రాబాద్ వీధుల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిస్తోంది. 200 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన మహంకాళి అమ్మవారి జాతరకు తెలంగాణాలోనే కాకుండా వివిధ రాష్ట్రాల్లో కూడా ఎంతో ప్రాముఖ్యత ఉంది. 21వ తేదీ నాడు బోనాలు ఆదివారం అమ్మవారు బోనాలు ప్రారంభమయ్యాయి. 22వ తేదీ సోమవారం రంగం కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉజ్జయినీ మహాకాళి దర్శనానికి తరలివచ్చిన జనంతో ఆలయ పరిసరాలు కళకళలాడుతున్నాయి. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలు, తొట్టెలు, ఫలహార బండ్ల ఊరేగింపులతో.. ఆదివారం లష్కర్ బోనాల జాతర అత్యంత వైభవంగా కొనసాగుతోంది. భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. పలు మార్గాల్లో ఆలయానికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. సాధారణ భక్తుల కోసం, వీఐపీల కోసం ప్రత్యేకంగా క్యూ లైన్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. దాతల పాస్‌ల కోసం ప్రత్యేకంగా మరో క్యూ లైన్‌ను ఏర్పాటు చేశారు. భాగ్యనగరంలో ప్రత్యేక సంస్కృతికి ప్రతీకగా నిలిచే లష్కర్ బోనాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.



తెల్లవారుజామున మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలతోపాటు బోనం సమర్పించారు. కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేర్వేరు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. అమ్మవారి దయవల్ల వర్షాలు సమృద్ధిగా పడి రైతులు ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. బోనాల జాతరకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు హైదరాబాద్ నగర ప్రజలు వారికి ఆతిథ్యం ఇచ్చి అమ్మవారి దర్శనం కలిగేలా చూస్తామన్నారు. ప్రజల సహకారంతోనే బోనాల జాతరను విజయవంతం అవుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. ఇంటి ఇల్లాలు తలంటు స్నానం చేసి, వ్రతం ఆచరిస్తారు. భక్తి శ్రద్ధలతో చక్కెర పొంగలి, బెల్లపు అన్నం, పసుపు అన్నం వండి.. కొత్త మట్టి కుండల్లో ఉంచుతారు. సున్నం, జాజు, పసుపు, కుంకుమలను రుద్ది.. వేపాకులతో అలంకరించి.. దాని మీద దీపం వెలిగిస్తారు. ఇలా బోనాన్ని తలమీద పెట్టుకుని.. డప్పు చప్పుల్ల మధ్య ఆలయానికి తరలివస్తున్నారు. అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తులు భారీ ఎత్తున హాజరవుతుండటంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించేందుకు మహంకాళి పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూంను.. పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంకి అనుసంధానం చేసి సీసీ కెమెరాల నిఘా పెంచారు. దాదాపు 5లక్షల మంది బోనాలు సమర్పిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.



## యువకుడి కడుపులో అడుగు సొరకాయ!

మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్ జిల్లాలో ఓ వింత ఘటన వెలుగు చూసింది. ఓ యువకుడి కడుపులోంచి అడుగుకు పైగా పొడవున్న సొరకాయను వైద్యులు బయటకు తీశారు. ప్రస్తుతం ఆ యువకుడి పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉంది. యువకుడికి వైద్యులు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. అతడి శరీరంలోకి ఇది మలద్వారం ద్వారా వచ్చి ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. సొరకాయను ఎవరైనా బలవంతంగా చొప్పించారా? లేదా ఇంకేమైనా జరిగిందా? అన్నది యువకుడు స్పృహలోకి వచ్చాక తెలియనుంది. మూడు రోజుల క్రితం ఖజురహో ప్రాంతానికి చెందిన ఓ యువకుడు తీవ్రమైన కడుపు నొప్పితో ఛతర్‌పుర్ జిల్లా ఆస్పత్రికి వచ్చాడు. భయంకరమైన కడుపు నొప్పిగా ఉందని, అస్సలు తట్టుకోలేక పోతున్నాని డాక్టర్లతో చెప్పాడు. ప్రాథమిక పరీక్ష అనంతరం అతడికి ఎక్స్‌రే తీశారు. కడుపులో పొడవైన వస్తువు చూసి డాక్టర్ నందకిశోర్ జాదవ్ షాక్ అయ్యారు. ఏం జరిగిందని యువకుడిని అడగ్గా.. అతడు చెప్పే పరిస్థితిలో లేడు. ఆపరేషన్ ద్వారా మాత్రమే ఆ వస్తువును తొలగించవచ్చని కుటుంబసభ్యులతో చెప్పారు. నందకిశోర్ జాదవ్ ఆధ్వర్యంలో శనివారం యువకుడికి ఆపరేషన్ జరిగింది. కొన్ని గంటలపాటు ఆపరేషన్ జరిగింది. వైద్యుల బృందం అతడి పొట్టలో తొడిమతో కూడిన సొరకాయను చూసి అవాక్కయ్యారు. ఈ సొరకాయ వల్ల యువకుడి పెద్ద పేగు పూర్తిగా నలిగిపోయింది. దీంతో అతనిడికి తీవ్రమైన నొప్పి వస్తోంది. యువకుడు స్పృహలోకి వస్తే గానీ అసలు విషయం ఏంటో తెలియరానుంది. సొరకాయ అడుగుకు పైగా పొడవు ఉన్నట్లు వైద్యులు చెప్పారు. మానసిక పరిస్థితి బాగాలేని వారే ఇలాంటి పనులు చేస్తారని వైద్యులు అంటున్నారు.

## కాశ్మీర్‌లో విరుచుకుపడ్డ ఉగ్రవాదులు



జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. సైనిక పికెట్లపై పెద్ద ఎత్తున దాడికి దిగారు. ఈ దాడిని సరిహద్దు భద్రత దళానికి చెందిన జవాన్లు తిప్పికొడుతున్నారు. కాల్పులతో ఈ ప్రాంతం మొత్తం హోరెత్తిపోతోంది. ఈ సమాచారంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అదనపు బలగాలను సంఘటన ప్రాంతానికి తరలిస్తోంది. జమ్మూ కాశ్మీర్‌లోని రాజౌరీ సెక్టార్‌లో భారత్‌పాకిస్తాన్ సరిహద్దులకు సమీపంలో ఉన్న గుంధా ఏరియాలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఉగ్రవాదుల దాడి విషయాన్ని ఆర్మీ ఉన్నతాధికారులు ధృవీకరించారు. ఆర్మీ పికెట్‌పై టెర్రరిస్టులు దాడికి పాల్పడినట్లు జమ్మూ డిఫెన్స్ పీఆర్‌ఓ వెల్లడించారు. కాల్పులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ తెల్లవారు జామున 4 గంటల సమయంలో జవాన్లు గుంధా ఏరియాలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తోండగా.. ఉగ్రవాదులు దాడికి దిగారు. ఈ ఘటనలో ఒక జవాన్ గాయపడినట్లు సమాచారం. సరిహద్దులను దాటుకుని చొరబడ్డ పాకిస్తాన్ ఉగ్రవాదులు ఈ ప్రాంతంలో తలదాచుకున్నట్లు పక్కాగా అందిన సమాచారం మేరకు జవాన్లు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. మూడు వారాల వ్యవధిలో జమ్మూ కాశ్మీర్‌లో సంభవించిన మూడో అతి పెద్ద దాడి ఘటన ఇది. కొద్ది రోజుల కిందటే ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు సైనికులు వీరమరణం పొందిన విషయం తెలిసిందే. మరో అయిదుమంది జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో కమాండర్ స్థాయి అధికారి ఉన్నారు. అంతకు వారం రోజుల ముందు కథువా జిల్లాలో కూడా ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఆర్మీ ట్రక్కులపై గ్రెనేడ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో అయిదుమంది సైనికులు కన్నుమూశారు. మరో అయిదు మంది గాయపడ్డారు. జమ్మూ ప్రాంతంలో 32 నెలల్లో 48 మంది సైనికులు వీరమరణం పొందారు.

## ఎవరు ఈ కమలా హారిస్?

గుర్తింపు తెచ్చుకున్నారు. తన తల్లిదండ్రుల విడాకుల తరువాత, కమలా హారిస్ తన తల్లి, సోదరితో కలిసి జీవించారు. ఆమె తన బ్యాచిలర్ డిగ్రీ కోసం చారిత్రాత్మక ఆల్ బ్లాక్ కళాశాల అయిన హోవార్డ్ విశ్వవిద్యాలయానికి వెళ్లారు. కమలా హారిస్‌కు పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్‌లో డిగ్రీ పట్టా పొంది. ఆ తర్వాత న్యాయశాస్త్రంలో చేరారు, 1990 లో బార్ అసోసియేషన్ సభ్యురాలిగా మారారు. అదే ఏడాది కాలిఫోర్నియాలో డిప్యూటీ డిస్ట్రిక్ట్ అటార్నీగా తన వృత్తిని ప్రారంభించారు.

2003లో శాన్‌ఫ్రాన్సిస్కో డిస్ట్రిక్ట్ అటార్నీగా ఎన్నికయ్యారు ప్రస్తుత ఉపాధ్యక్షురాలు. 2010, 2014లో కాలిఫోర్నియాకు ఎన్నికైన అటార్నీ జనరల్‌గా రెండు పర్యాయాలు పనిచేశారు. 2017లో ఆమె తన రాష్ట్రం నుంచి జూనియర్ యూఎస్ సెనేటర్ అయ్యారు. పన్ను, ఆరోగ్య సంస్కరణలు, వలసదారులకు పౌరసత్వం, తుపాకీ నియంత్రణ చట్టాల మీద ప్రచారాలతో ఆమె మంచి వెలుగులోకి వచ్చారు. సెనేట్‌లో పనిచేసిన రెండో ఆఫ్రికన్ అమెరికన్, తొలి ఆగ్నేయాసియా మహిళగా ఆమె గుర్తింపు పొందారు. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచిన కమలా హారిస్, జో బైడెన్‌కు మద్దతుగా రేసు నుంచి తప్పుకున్నారు. అనంతరం ఆయన పాలనలో ఉపాధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. ఆగస్ట్‌లో జరగనున్న ఈవెంట్‌లో డెమొక్రాట్లు తమ అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకోనున్నారు.

కమలా హారిస్ ఈ నామినేషన్‌లో గెలిస్తే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న తొలి భారత సంతతి మహిళగా చరిత్ర సృష్టిస్తారు. అంతేకాకుండా, అధ్యక్ష ఎన్నికల్లో ఆమె విజయం సాధిస్తే, దేశానికి మొదటి భారతీయ సంతతి మహిళ సహా అమెరికా తొలి అధ్యక్షురాలు అవుతారు!

రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్ సతీమణి భారతీయురాలు కావడం, వలస ఓటర్లను ఆకట్టుకోవడంలో భారత సంతతి మహిళగా కమలా హారిస్‌కి ఉన్న గుర్తింపు రానున్న ఎన్నికల్లో పెద్ద పాత్ర పోషించనుంది. కమలా హారిస్ తన పార్టీ నుంచి నామినేషన్ గెలుచుకున్నప్పటికీ అధ్యక్ష పదవిని చేపట్టడం అంత సులభం కాదు. ఇందుకు కారణం డొనాల్డ్ ట్రంప్! రిపబ్లికెన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్.. డెమొక్రాట్లకు ఈసారి గట్టిపోటీనిస్తున్నారు. "అమెరికా అధ్యక్ష రేసులో నిలిచేందుకు అధ్యక్షుడి ఆమోదం పొందడం గౌరవంగా ఉంది," అని కమలా హారిస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమెకు కౌంటర్ ఇస్తూ.. "జో బైడెన్ కన్నా కమలా హారిస్‌ను ఓడించడమే చాలా సులభం," అని ట్రంప్ తెలిపారు.

## 7 నెలలు కావొస్తుంది

తన సర్వీస్ అంశానికి సంబంధించి లేఖలను ఇచ్చినట్లు తెలిసింది. అయితే తాజాగా మాజీ డీఎస్పీ నళిని ఫేస్ బుక్ లో పోస్ట్ చేశారు. సీఎం కలిసిన ఒక్క నెలలోనే తన పిటిషన్ పై ఎంక్వైరీ పూర్తి చేస్తారని భావించానని.. కానీ 7 నెలలు పూర్తి కావొస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు తన రెండు దరఖాస్తులు బల్ల మీదనే ఉన్నాయా..? లేక చేత బుట్టలోకి పోయాయా..? అంటూ తన అనుమానాన్ని వ్యక్తం చేసింది.

"సిఎం సార్ కొలువుకు ఎక్కగానే నన్ను మీద మీద యాది చేసిందు .ఇప్పుడేమో సప్పుడే చేస్తలేడు. మధ్యల తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు కూడా జరిగినాయి.ఆశ్చర్యంగా నా ఊసే ఎత్తలేదు.ఇంతకీ నా రెండు దరఖాస్తులు బల్ల మీదనే ఉన్నయో లేక చెత్త బుట్టలోకి పోయినవో నని డౌట్ వస్తుంది. ఇప్పుడే చీఫ్ cro ను osd sir ని కదిలించా..! చిట్టి రాసిన. మా చిన్నప్పుడు ఆడుక్కొనేటోడు ఇంటి ముందుకు వస్తె ,ఇంట్లో చల్లన్నం లేకపోతే పైకి వెళ్లవయ్య అని మెల్లగా చెప్పేటోల్లం. కనీసం ఆ పాటి మర్యాద అయినా నాకు ఇస్తారేమో చూడాలి.అందుకే నేను ఇన్నేళ్ళు ఎవ్వరినీ కలవాలే.ఉద్యమం చేసేటప్పుడే నాకు చాలా విషయాలు అర్థం అయినవి". "ఒక నెలలోనే నా పిటిషన్ పై ఎంక్వైరీ పూర్తిచేస్తారు అనుకున్నా. 7 నెలలు కావొస్తోంది.అందుకే రిమైండర్ లెటర్,పోస్ట్ రాయాల్సి వచ్చింది. సెక్రటేరియట్ చుట్టూ తిరిగేంత సమయం మరియు ఓపిక నా వద్ద లేవు అని నేను ఆ రోజే రేవంతన్నకు చెప్పినా..!" అని నళిని తన పోస్టులో రాసుకొచ్చారు. తాజాగా నళిని చేసిన పోస్టులో ప్రభుత్వానికి రాసిన లేఖను కూడా పోస్ట్ చేసింది. డిసెంబర్ 30, 2023వ తేదీన ముఖ్యమంత్రికి రెండు పిటిషన్లు ఇచ్చానని గుర్తు చేశారు. అయితే నళిని చేసిన తాజా లేఖపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది..!

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుంది

- ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తుంది
- గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొన్నగారి రాజు



**జయభేరి, జులై 21:**

ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తుందని గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొన్న గారి రాజు స్పష్టం చేశారు. గజ్వేల్ లోని మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా నిధులు సేకరించి రైతుల సంక్షేమం కోసం 31 వేల కోట్ల రూపాయల నిధులతో అర్హులైన ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసిందని, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల తెలంగాణ రాష్ట్రం దేశానికి రోల్ మోడల్ గా నిలిచిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని, రింగ్ రోడ్డు బస్టాండు నిర్మాణం చేయడంలో ఆయన ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మున్సిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పేరిట అవినీతికి పాల్పడ్డారని, పట్టణంలో ఎక్కడ చూసినా మురికి గుంతలు అధ్వానంగా సిసి రోడ్లు ఉన్నాయనీ ఆరోపించారు. అర్హులైన పేదవారికి నీడ కల్పించి డబల్ బెడ్ రూమ్ ఇస్తానని నమ్మించి మూడుసార్లు ఓట్లు దండుకున్న కేసీఆర్ కు రాష్ట్ర ప్రజలే తగిన గుణపాఠం చెప్పారన్నారు. లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించలేదని, ఈ పథకంలో కూడా బిఆర్ఎస్ నేతలు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగరాజు, జిల్లా యువజన విభాగం జనరల్ సెక్రటరీ ఫారుఖ్ జానీ, తలకొక్కుల ప్రేమ్ కుమార్, ఉప్పల ప్రవీణ్ కుమార్, కప్ప భాస్కర్, కర్ణాకర్, సతీష్, నాగరాజు, టిల్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## తుంకుంట ఓ హోటల్ పై శానిటేషన్ అధికారుల దాడులు

- నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని, హోటల్ ను సీజ్ చేసిన అధికారులు

**జయభేరి, జులై 20:**

మేడ్చల్ జిల్లా తుంకుంట మున్సిపల్ పరిధిలోని రాజీవ్ రహదారిపై గల కృష్ణ హోటల్ ను శానిటేషన్ అధికారులు తనిఖీ చేశారు. ఈ హోటల్ లోని బిర్యానీలో బొద్దింక వచ్చిందని శ్రీనివాస్ రెడ్డి అనే వినియోగదారుడు శానిటేషన్ అధికారులకు ఫోన్ లో ఫిర్యాదు చేశారు. దీంతో శానిటేషన్ ఇన్స్ స్పెక్టర్,రేణుక సిబ్బందితో కలిసి హోటల్ ను తనిఖీ చేశారు. అయితే హోటల్ లో నాణ్యత ప్రమాణాలు సరిగా పాటించడం లేదని వారు గుర్తించారు. ఎక్కడ చూసినా అపరిశుభ్ర వాతావరణం ఉందని తెలిపారు. దీంతో హోటల్ ను సీజ్ చేస్తున్నట్లు వారు వెల్లడించారు. ఇకపై నాణ్యత ప్రమాణాలు పాటించని హోటళ్లపై కఠినంగా వ్యవహరిస్తామని వారు హెచ్చరించారు. ఈ దాడుల్లో వార్డు ఆఫీసర్లు ప్రసన్న, మౌనిక, బిల్ కలెక్టర్ మన్నె కిష్టయ్య, జవాన్లు నరేష్, ప్రవీణ్ రెడ్డి, జగన్నాథం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆపదలో అండగా సీఎం సహాయనిధి

- గుండ్లపోచంపల్లిలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**జయభేరి, మేడ్చల్ :**

పేదవారికి సీఎం సహాయనిధి ఆపదలో అండగా నిలుస్తోందని గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సీఎం సహాయనిది పథకం ద్వారా మంజూరైన చెక్కులను శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన ఎస్.రాజు కు రూ.60 వేలు, సౌజన్య కు రూ.45 వేలు, తేజశ్రీ కి రూ.21 వేలు చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆపద సమయాల్లో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మెరుగైన వైద్యానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అమరం జైపాల్ రెడ్డి, అమరం హేమంత్ రెడ్డి, భేరి బాలరాజు, నాయకులు సురేందర్ గౌడ్, జిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ మాట అంగన్‌వాడిబాట ప్రారంభం



**జయభేరి, మేడ్చల్ :**

పేద నిరుపేదలకు పిల్లల చదువులు భారంగా ఉండకూడదని ప్రభుత్వం చేపట్టిన అమ్మ మాట అంగన్ వాడి బాట కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని గుండ్లపోచంపల్లి కౌన్సిలర్ అమరం హేమంత్ రెడ్డి అన్నారు. శనివారం 14వ వార్డులోని అంగన్ వాడి కేంద్రంలో నిర్వహించిన అమ్మమాట అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు వరలక్ష్మి మాట్లాడుతూ పిల్లలు ఇంటి దగ్గర చదువుకోవడానికి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పిల్లలు ప్రతిరోజూ పాఠశాలకు పంపించాలన్నారు. చదువు పట్ల శ్రద్ధ కనబరిచి విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు.

## వాసవి క్లబ్.. వాసవి వనిత క్లబ్ క్యాబ్నెట్ మీటింగ్ సమావేశం



**జయభేరి, దేవరకొండ :**

ఆగ్రో రిసార్ట్ ఖమ్మంలో జరుగుతున్న శుభ సందర్భంగా దేవరకొండ నుండి వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు తొనుకనూరి విజయ సెక్రటరీ మంచికంటి పద్మ జోన్ చైర్మన్ నీల సంజీవ్ కుమార్, IPC లకుమారపు మల్లయ్య సతీమణి సుకన్య సెకండ్ క్యాబినెట్ మీటింగ్ కు అటెండ్ అయ్యారు క్యాబినెట్ సమావేశంలో వాసవి క్లబ్ వాసవి వనిత క్లబ్ సభ్యులు తదితర విషయాల గురించి చర్చించినారు.

# రైతును రాజుగా చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

- కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని మరోసారి నిరూపించాం
- వర్షంలో రైతులతో కలిసి ట్రాక్టర్ ర్యాలీతో సంబరాలు
- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి రైతు రుణమాఫీ సంబరాలను పురస్కరించుకొని ఆదివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన రైతు రుణమాఫీ సంబరాలలో భాగంగా ఏర్పాటు చేసిన ట్రాక్టర్ ర్యాలీ లో దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ పాల్గొని. 100 ట్రాక్టర్లతో రైతులు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని మరోసారి నిరూపించాం. చేస్తామన్న రుణమాఫీని విడతల వారీగా చేసే ప్రయత్నంలో భాగంగా మొదటి విడత రుణమాఫీ చేశామని అతి కొద్ది రోజుల్లో మిగతా రెండు విడతల రుణమాఫీ చేస్తామని తెలిపారు..దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు రూ.2 లక్షలలోపు రుణాలను మాఫీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని, ఎన్నికల హామీల్లో భాగంగా అధికారంలోకి వచ్చిన వెంటనే కొన్ని హామీలు అమలు చేశామని, మిగతా హామీలు కూడా త్వరలో అమలావుతాయని తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు

- గురు పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని చింతపల్లి మండలం కేంద్రంలోని శ్రీ సాయి బాబా ఆలయానికి సందర్శించి, స్వామి వారిని దర్శించుకొని, వేద పండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి సాయి బాబా అయలం కొరకై విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని, ట్రాన్స్ ఫార్మర్ ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు SC,AD, మండల పార్టీ అధ్యక్షులు నాగభూషణం, చింతపల్లి మండల మాజీ ఎంపీపీ కొండూరు భవాని పవన్ కుమార్, మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి,దేవాలయ కమిటీ చైర్మన్ మంచి కంటి ధనంజయ, ఆలయ కమిటీ సభ్యులు రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొర్ర రాంసింగ్ నాయక్,యువజన విభాగం నాయకులు VVR, సాయి రాథోడ్, మాకట్ లాల్, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎల్బీసీ,డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలి

- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ,మునుగోడు నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నం ఎస్ఎల్బీసీ,డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి అన్నారు.శనివారం నాడు దేవరకొండ పట్టణ నిర్మాణ కౌన్సిల్ సమావేశం కామ్రేడ్ పల్లా పర్వత్ రెడ్డి భవన్ లో కామ్రేడ్ నీలా వెంకటయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన నర్సింహా రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయకుండా కేవలం కమిషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు మీద శ్రద్ధతో కాలయాపన చేసి నల్లగొండ జిల్లా ప్రాజెక్టు లను గాలికొదిలేసిందని అన్నారు.నక్కలగండి ప్రాజెక్టు వద్ద కుర్చీ వేసుకొని కూర్చొని పూర్తి చేస్తానన్న మాజీ సీఎం కేసీఆర్ 10 ఏళ్ల పాలనలో ఎన్నడూ పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. కాంగ్రెస్ హయాంలో స్వర్గీయ వైఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలో సొరంగమార్గం టన్నెల్ పనులు పూర్తి దశలో ఉండగా బిఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో 10 కిలోమీటర్లు పూర్తిచేయడానికి శ్రద్ధ చూపలేదని అన్నారు.ఎస్ఎల్బిసీ, నక్కల గండి ప్రాజెక్టు లను ప్రారంభించిన కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి రావడం శుభ పరిణామమని ప్రజా, రైతు ఆకాంక్షల మేరకు ప్రారంభించిన ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం వీలైనంత త్వరగా పూర్తి చేయాలనీ ఆయన కోరారు.డిండి లిఫ్ట్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వీలైనంత త్వరగా పూర్తిచేయాలని డిండి ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గ ప్రజలకు సాగు,తాగు నీటినందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, జిల్లా సమితి సభ్యులు వలమల్ల ఆంజనేయులు, పట్టణ కార్యదర్శి జూలూరి వెంకట్రాములు, సహాయ కార్యదర్శులు పగిల్లా బుచ్చయ్య, తోటపల్లి నాగేష్, కౌన్సిల్ సభ్యులు ఎండి మైనొద్దీన్, ఏషామోని మల్లేష్, కందుకూరి శ్రీను, జూలూరి జ్యోతిబస్, లింగంపల్లి వెంకటయ్య,బొడ్డుపల్లి గెల్వయ్య, పుప్పాల గిరిప్రసాద్, పర్వతం శ్రీను,నీలా అనసూయ, పద్మ, జాకీర్, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం బాటిల్లను ధ్వంసం చేసిన ఎక్సైజ్ పోలీసులు

- అక్రమంగా బెల్టు షాపులు నడిపితే చర్యలు తప్పవు - ఎక్సైజ్ సూపరంటెండెంట్ మాధవయ్య



**జయభేరి, జులై, 21:**

మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల ఎక్సైజ్ మరియు పోలీస్ ల ఆధ్వర్యంలో బెల్టుషాపులపై దాడులు నిర్వహించారు. కాగా మొత్తం 63 కేసులు నమోదవగా 690 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఎక్సైజ్ అడిషనల్ సూపరింటెండ్ మాధవయ్య పర్యవేక్షణలో మద్యం బాటిల్లను ధ్వంసం చేశారు. ఇకపై ఎవరూ బెల్టు షాపులు నడుపుతూ మద్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనాథ్, ఎస్సైలు,హారిక, అనిత,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**జయభేరి, మేడ్చల్ :**

పేద ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ప్రభుత్వం సీఎం సహాయనిధి పథకాన్ని అమలు చేస్తుందని మేడ్చల్ ఎమ్మెల్యే చమకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం మేడ్చల్ మున్సిపాలిటీ 17వ వార్డుకు చెందిన బొల్లి భాగ్యమ్మ కు సీఎంఆర్ఎఫ్ పథకం కింద మంజూరైన రూ.27000 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి చేతుల మీదుగా లబ్దిదారుని కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ గౌడ్ మాట్లాడుతూ ఆపదలో వుండి, ఆర్ధికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బిఆర్ యస్ నాయకులు సందీప్ గౌడ్, మహేష్ యాదవ్, నాగేష్ ముదిరాజ్, పృథివి తదితరులు పాల్గొన్నారు.

## బిజెవైఎం నిరుద్యోగ మహాధర్నా




**జయభేరి, మేడ్చల్ :**

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి కావేరి శ్రీధర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. శనివారం నిరుద్యోగ యువత న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర బిజెవైఎం తలపెట్టిన నిరుద్యోగ మహాధర్నా కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా నుండి అనేక మంది బిజెవైఎం కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి కావేరి శ్రీధర్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో నిరుద్యోగ యువత అనేక పోరాటాలు చేసి రాష్టాన్ని సాదించుకుంటే సొంత రాష్ట్రంలో ఉద్యోగాల కోసం పోరాటాలు చేయాల్సిన దౌర్భాగ్యం పట్టిందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో యువతకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేదంటే బిజెవైఎం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెవైఎం నాయకుడు రాగం అర్జున్, అశోక్, చింటూ, నందు తదితరులు పాల్గొన్నారు.




# శ్రీలంకన్ బ్యూటీ జాక్వెలిన్‌కు

## జైలు నుంచి ప్రేమలేఖ రాసిన సుకేశ్..!

రూ.200కోట్ల మనీలాండరింగ్ కేసులో నిందితుడు సుకేశ్ చంద్రశేఖర్ మరోసారి బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండేజ్‌కు మరోసారి ప్రేమ లేఖ రాశాడు. మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ మండోలి జైలులో ఉన్న సుకేశ్ గతంలోనూ జాక్వెలిన్‌కు జైలు నుంచే ప్రేమలేఖలు పంపిన విషయం తెలిసిందే. ఆగస్టు 11న జాక్వెలిన్ ఫెర్నాండేజ్ పుట్టిన రోజు సందర్భంగా వంద మందికి ఐఫోన్ 15ప్రో ఇవ్వనున్నట్లు ప్రకటించాడు. ఇటీవల శ్రీలంకన్ బ్యూటీ కొత్తపాట 'యిమ్మీ యిమ్మీ' పాట బాగుందంటూ లేఖలో అభినందించారు. తన లాయర్ ద్వారా సుకేశ్ మీడియాకు లేఖను విడుదల చేశాడు. తాను ఆ పాటను చాలాసార్లు చూశానని.. దాంతో వంద మందికి ఐఫోన్ 15 ప్రో కానుకగా ఇవ్వనున్నట్లు ప్రకటించాడు. లేఖలో అందంపై ప్రశంసలు కురిపించాడు. సాంగర్ వంద మిలియన్ల వ్యూస్‌ను దాటిందని.. జాక్వెలిన్ బాలీవుడ్‌కి నిజమైన క్వీన్ అంటూ లేఖలో రాసుకొచ్చాడు. ఇదిలా ఉండగా.. రూ.200కోట్ల కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇటీవల బాలీవుడ్ బ్యూటీకి సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. కేసులో విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. ఈ వ్యవహారంలో ఇప్పటికే పలుసార్లు ఈడీ విచారించింది. ఈ కేసులో జాక్వెలిన్‌ను నిందితురాలిగా పేర్కొన్నా.. ఈడీ అరెస్టు చేయలేదు. 2022 నవంబర్ 15న కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. మనీలాండరింగ్ కేసులో లంకన్ బ్యూటీని ఈడీ పలుమార్లు విచారించడంతో పాటు పలు ఆస్తులను స్వాధీనం చేసుకున్నది. సుకేశ్ నుంచి రూ.7కోట్లకుపైగా విలువైన ఆభరణాలు, వస్తువులను బహుమతిగా ఇచ్చినట్లుగా ఆరోపణలున్నాయి. ఆమెతో పాటు కుటుంబీకులకు అనేక అత్యాధునిక కార్లు, ఖరీదైన బ్యాగులు, బట్టలు, బూట్లు, ఖరీదైన వాచ్‌లను బహుమతిగా ఇచ్చినట్లు ఈడీ ఆరోపించింది. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను జాక్వెలిన్ ఖండించింది. సుకేశ్ తనను మోసం చేసినట్లుగా చెప్పుకొచ్చింది.




# ధనుష్‌తో ప్రేమ కథ

'యానిమల్' చిత్రంతో బాలీవుడ్ నాయిక త్రిప్తి దిమ్రి జాతకం ఒక్కసారిగా మారిపోయింది. ఆ సినిమా తర్వాత ఈ భామ డేట్స్ కోసం బాలీవుడ్ అగ్ర దర్శకనిర్మాతలు పోటీ పడ్డారు. ప్రస్తుతం త్రిప్తి చేతిలో అరడజనుకుపైగా భారీ చిత్రాలున్నాయి. తాజాగా ఈ భామ బాలీవుడ్‌లో మరో బంపరాఫర్‌ను చేజిక్కించుకుంది. ధనుష్ నటిస్తున్న 'తేరే ఇష్క్ మే' చిత్రంలో కథానాయికగా త్రిప్తి పేరును ఖరారు చేశారు. ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కనుంది. ధనుష్‌ఆనంద్ ఎల్ రాయ్ కాంబినేషన్‌లో వచ్చిన 'రాన్‌జనా' విషాద ప్రేమకథగా ప్రేక్షకుల్ని మెప్పించింది. దాదాపు పదేళ్ల విరామం తర్వాత వీరిద్దరు కలిసి పనిచేస్తుండటంతో 'తేరే ఇష్క్ మే' చిత్రంపై ఇప్పటికే అంచనాలు ఏర్పడ్డాయి. 'రాన్‌జనా' తరహాలోనే వారణాసి నేపథ్య కథాంశంతో 'తేరే ఇష్క్ మే' చిత్రం తెరకెక్కనుందని చెబుతున్నారు. ఈ సినిమాలో ధనుష్ ప్రేమికురాలిగా త్రిప్తి దిమ్రి కనిపించనుంది. అక్టోబర్‌లో ఈ చిత్రం సెట్స్‌మీదకు వెళ్లనుంది. త్రిప్తి ద్రిమి నటించిన తాజా చిత్రం 'బ్యాడ్‌న్యూస్' ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకురానుంది.



# భర్త.. భార్య.. ప్రియురాలు

వెంకటేశ్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వచ్చిన ఎఫ్1, ఎఫ్2 చిత్రాలు భారీ విజయాలను నమోదు చేసుకున్నాయి. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి వీరిద్దరి కలయికలో సినిమా రానుంది. దిల్‌రాజు, శిరీష్ నిర్మాతలు. ఇది ప్రతిష్టాత్మక శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై రూపొందుతోన్న 58వ సినిమాకావడం విశేషం. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ 'సినిమా రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో మొదలైంది. ప్యాలెస్‌లో జరుగుతున్న షూటింగ్‌లో మెయిన్ కాస్ట్ పాల్గొంటున్నారు. హీరో, అతని గర్ల్‌ఫ్రెండ్, అనతి ఎక్స్‌లెంట్ వైఫ్.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్ ఇది. ఇందులో వెంకటేశ్ జోడీగా మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ నటిస్తున్నారు. రీసెంట్‌గా విడుదల చేసిన మేకింగ్ వీడియో వర్కింగ్ ఎట్మాస్పియర్‌ని చూపించింది. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న సినిమా ఇది' అని తెలిపారు. ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయికుమార్ నరేశ్, వీటీ గణేశ్, మురళీధర్‌గౌడ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.





# మైకేల్ జాక్సన్‌తో

## పాట మిస్ అయ్యింది!

ప్రపంచవ్యాప్త సంగీత ప్రియులు ఎంతగానో ఆరాధించే పాప్ రారాజు మైకేల్ జాక్సన్ ఓ భారతీయ సినిమాలో ఆడిపాడితే ఎలా ఉండేది? ఆ ఊహే అద్భుతం కదా? అందుకోసం ప్రయత్నాలు కూడా జరిగాయి. అయితే మైకేల్ జాక్సన్ అకాల మరణంతో ఆ కల సాకారం కాలేకపోయింది. ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ ఆ ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ "స్లమ్‌డాగ్ మిలియనీర్' చిత్రానికి ఆస్కార్ గెలుచుకున్న అనంతరం లాస్‌ఏంజిలస్‌లో మైకేల్ జాక్సన్‌ను కలిశా. 'స్లమ్‌డాగ్ మిలియనీర్' మ్యూజిక్ తనకెంతో నచ్చిందని నాతో చెప్పారు. తన పిల్లలను కూడా నాకు పరిచయం చేశారు. ఇండియాకు వచ్చిన తర్వాత మైకేల్ జాక్సన్‌ను కలిసిన విషయాన్ని దర్శకుడు శంకర్‌తో పంచుకున్నా. అప్పుడు ఆయన 'ఎంథిరన్' షూటింగ్‌లో ఉన్నారు. 'మైకేల్ జాక్సన్‌తో మన సినిమాలో ఓ పాట పాడిస్తే ఎలా ఉంటుందో ఆలోచించు. అది సాధ్యమయ్యే పనేనా?' అంటూ శంకర్ నాతో అన్నారు. ఆ మరుసటి రోజే నేను మైకేల్ జాక్సన్‌తో ఫోన్‌లో ఈ విషయాన్ని చెప్పాను. 'మీరు ఏం చెప్పినా నేను చేయడానికి సిద్ధం. మనిద్దరం కలిసి వర్క్ చేద్దాం' అన్నారు. ఇది జరిగిన కొన్ని నెలలకే మైకేల్ జాక్సన్ మరణించారు. దాంతో మేమిద్దరం చేయాల్సిన తమిళ సాంగ్ ఆగిపోయింది' అని ఏఆర్ రెహమాన్ చెప్పారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com